🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
✆ : 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 24 | 13-03-2023 | పుటలు : 4


# నన్నయలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న దృశ్యం

**07.03.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వేన్షన్ సెంటర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య జి.వి.ఆర్. ప్రసాదరాజు, గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితి వైస్ చైర్మన్ డా.పి.చిరంజీవిని కుమారి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి, నన్నయ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉమెన్ ఎంపవర్మెంట్, డెవలప్మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో డిజిటల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలటీ అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్ డా.కె.నూకరత్నం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేసారు. విశ్వవిద్యాలయాలలో పురుషులు, స్త్రీలు చక్కని వాతావరణంలో పని చేయాలని అన్నారు. పురుషులు కంటే మహిళలకు ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని వాటిని అధిగమించి సమాజంలో ముందుకు సాగుతున్నారని చెప్పారు. ఫిలిప్పియన్స్ అధ్యక్షురాలు మహిళా సాధికారతకు అమితమైన కృషి చేసి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. నోబల్ ప్రైజ్ గ్రహీత మేడమ్ క్యూరీ, కిరణ్ బేడీ వంటి మహిళలు ఆయా రంగాల్లో ప్రతిభ కనపరచిన మహిళలు ఎందరో ఉన్నారని గుర్తుచేసారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మహిళలు అన్ని రంగాల్లోను రాణించాలని పిలుపునిచ్చారు. డా.పి.చిరంజీవిని కుమారి మాట్లాడుతూ బయోలాజికల్ వ్యత్యాసం మినహా పురుషులకు, స్త్రీలకు మధ్య ఎటువంటి వ్యత్యాసం ఉండకూడదన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులలో మహిళలు ఎక్కువగా ఉండడం హర్షనీయమన్నారు. విద్యతోనే మహిళా సాధికరత సాధ్యమవుతుందని అన్నారు. ఆడపిల్ల పుట్టిన వెంటనే సమాజం ఆనదంగా స్వాగతించాలన్నారు. విద్యార్థులంతా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. మానవ హక్కులన్ని మహిళా హక్కులుగా సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన నిర్వహకులను అభినందించారు. విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులకు మహిళ దినోత్సవం సందర్భంగా వివిధ పోటీలను నిర్వహించారని, వాటిలో చక్కని ప్రతిభ కనపరచిన మహిళలు అందరిని అభినందించారు. తరువాత అతిథులను సన్మానిచి జ్ఞాపికలను అందజేసారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ కనపరచిన వారికి బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ డా.కె.నూకరత్నం, ప్రిన్సిపాల్స్ ఆచార్య.కె.రమణేశ్వరి, డా. వి. పెర్సిస్, ఛీఫ్ వార్డెన్ డా.డి.జ్యోతిర్మయి, ఎస్సీ,ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ డా.పి.విజయనిర్మల, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, ఈసీ మెంబర్ ఆచార్య కె.సునీత, డా.పి.ఉమమహేశ్వరి, ,సిస్టమ్ మేనేజర్ ఎ.వి.ఎం.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరాజు




సమావేశంలో మాట్లాడుతున్న డా.చిరంజీవిని కుమారి

# చైల్డ్ సైకాలజీ కోర్సును సద్వినియోగం చేసుకోండి

## బ్రోచర ఆవిష్కరించిన వీసీ ప్రసాదరాజు




ఆదికవి నన్నయ యూనివర్సిటీ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో చైల్డ్ అండ్ అడోలెసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పీజీ డిప్లొమా కోర్సును ప్రారంభిస్తున్నామని, ఈ కోర్సును అందరూ సద్వినియోగం చేసుకోవాలని వీసి ఆచార్య జీవిఆర్ ప్రసాద రాజు తెలిపారు. యూనివర్సిటీలో దీనికి సంబంధించిన బ్రోచర్లను వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేసారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్టమెంట్ ఆఫ్ సైకాలజీ ఆధ్వర్యంలో చైల్డ్ అండ్ అడోలెసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ డిప్లొమా కోర్సును ప్రారంభిస్తున్నామని అన్నారు. ఏడాది కాలపరిమితితో 40 సీట్లతో అనుభవజ్ఞులైన అధ్యాపకుల నిర్వహణలో పీజీ డిప్లొమా కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. ఏదైన డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు పీజీ డిప్లొమా కోర్సులో చేరేందుకు అర్హులని చెప్పారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 2వ తేదీ నుండి 17వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ 0883-256611 / 7093008477 నెంబర్లను సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, కోర్స్ కోఆర్డినేటర్ డా. నక్కిన నారాయణ డా. పడాల రాజశేఖర్, డా. సిహెచ్. భవాని పాల్గొన్నారు.

## మంచిమాట

ఆత్మవిశ్వాసం ఉన్న కొందరి వ్యక్తుల చరిత్రే ప్రపంచ చరిత్ర.ఆత్మ విశ్వాసం వ్యక్తిలోని దివ్యత్వాన్ని వ్యక్తపరుస్తుంది. మీరు ఏదైనా సాధించగలరు. ఆ అనంతశక్తిని అభివ్యక్తం చేయడానికి కావలసినంత ప్రయత్నం చేయనప్పుడే మీరు విఫలమవుతారు. ఎప్పుడైతే మనిషిలో నమ్మకం సన్నగిల్లుతుందో అప్పుడు మరణం ఆసన్నమౌతుంది.

The history of the world is the history of a few men who had faith in themselves. That faith calls out the divinity within. You can do anything. You fail only when you do not strive sufficiently to manifest infinite power. As soon as a man or a nation loses faith, death comes.



- స్వామి వివేకానంద

## సంపాదకీయం




# నాణెం

కనిపించే మూడు సింహాలు న్యాయానికి, నీతికి, ధర్మానికి ప్రతీకలైతే కనిపించని నాలుగో సింహమేరా!..... ఇదొక పాపులర్ సినిమా డైలాగ్. అశోకుని స్తంభం మీద నాలుగు సింహాల బొమ్మను మనం మన రాజముద్రికగా తీసుకున్నాం. శిల్పంలో నాలుగు సింహాలు కనిపిస్తాయి కానీ ముద్రలో నాలుగో సింహం కనిపించదు. నిర్ణయాధికారం గల పార్లమెంట్, అమలు చేసే యంత్రాంగం, న్యాయవ్యవస్థ ఈ మూడూ కనిపించే మూడు సింహాలు. దీనినంతటిని ప్రజల ముందుకు తీసుకెళ్లేది మీడియా. అందుకని దానిని ఫోర్త్ ఎస్టేట్ అన్నారు. కనిపించని నాలుగో సింహం అదే. ఈ నాలుగో సింహం అనే మాటను చాలా విషయాల్లో ఇవాళ వాడుతున్నారు. నాణెంలో కనిపించని నాలుగో సింహాన్ని నేనే! లాంటి సరదా మాటలు పుట్టుకొచ్చాయి.

ఏదేమైనా నాణెంమీద బొమ్మ బొరుసుల్లో బొమ్మ చాలా శక్తివంతమైంది. టాస్ వేసి బొమ్మ బొరుసులను బట్టి గేమ్ మొదలవుతుంది.క్రీడా మైదానాల్లో ఇది చాలా ముఖ్యమైన ఆసక్తికరమైన ఘట్టం కూడా. గ్రౌండ్లోకి వెళ్తూ బయట "ఇదిగో బొమ్మ పడితే మనమే గెలుస్తాం" అన్నాడు కెప్టెన్.ఆసక్తిగా చూశారు క్రీడాకారులంతా. బొమ్మ పడింది. ఎక్కడలేని ఉత్సాహం తన్నుకొచ్చింది. ఆత్మవిశ్వాసం నరాల్లో నిండి పోయింది. టీమ్ నెగ్గారు.కెప్టెన్ ని బుజాల మీద ఎక్కించుకుని గ్రౌండ్ లో ఊరేగించారు. అతని జేబులో ఉన్న నాణానికి రెండు వైపులా బొమ్మ ఉందని వాళ్ళకి తెలియదు. ఆత్మవిశ్వాసాన్ని, ఉత్సాహాన్ని క్రీడాకారుల్లో నింపటానికి కెప్టెన్ చేసిన మ్యాజిక్ అది.

కోనసీమలో మలికిపురం కాలేజీలో చదివే రోజుల్లో పొన్నపల్లి శ్రీరామారావు గారు మాకు తెలుగు టీచర్.ఆయన క్లాసంటే చెవి కోసుకునేవాళ్లం.బోలెడన్ని చమత్కారాలు. అంతే బరువైన బోధన.ఒకసారి క్లాసులో జేబులోంచి నాణాన్ని తీసి దీని విలువెంత అన్నారు.ఐదు రూపాయలని అన్నాం.ఈ నాణానికి కొంత ఖిలమంటుకొని ఉంది. దానిని తొలగించిన తర్వాత విలువెంత అని అడిగారు. ఐదు రూపాయలేనని సమాధానం ఇచ్చాం. అంటే ఐదు రూపాయల విలువతో విలువ లేని కొంత ఖిలం కూడా ఐదు రూపాయలుగా చలామణి అయిపోతుంది కదా అని అడిగారు. అవునన్నాం. ఈ సమాజంలో మంచితో పాటు చెడు కూడా చలామణి అయిపోతూ ఉంటుంది. అది గమనించుకోవాల్సిన బాధ్యత మనదేనన్నారు. నిత్యం జేబులో ఉండే కొన్ని నాణాలు మనకు ఎంత సందేశాన్ని ఇస్తున్నాయో అర్థమైంది.

నాణెంపై ఉండే భారత్, ఇండియా పదాలతో పాటు సత్యమేవ జయతే! లాంటి శక్తివంతమైన వాక్యం ఎంత అవసరమో అర్థమైంది. ఎన్నో వారసత్వపు చిహ్నాలతో పాటు మహనీయుల చిత్రాలను అందించే నాణాలు మన గత వైభవ స్మరణానికి చిహ్నాలు!అంతేనా ఎన్నో వ్యక్తిత్వ నిర్మాణానికి సంబంధించిన ఉదాహరణలకు ఆధారాలు!!

# ఎమ్మెస్ఎన్ క్యాంపస్‌లో మహిళా దినోత్సవం

కాకినాడ తిమ్మాపురంలోగల ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. కమల కుమారి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జీవిఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్ని రంగాలలో ముందుండాలని మహిళా లేనిదే కుటుంబం లేదు మహిళలేనిదే సమాజం అభివృద్ధి చెందదు అని పేర్కొన్నారు. మీరందరూ ధైర్యవంతులుగా ఉండి సమాజంలో ఉన్నత స్థితికి చేరుకొని మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో వివిధ ఘనతలు సాధించిన మదర్ థెరెసా, మేడమ్ క్యూరీ, ఇందిరాగాంధీ వంటి అనేక మహిళా మణుల జీవితాలను ఆయన ఉదాహరిస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరో ముఖ్య అతిథి




విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మరియు కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జొన్నకూటి సునీత మాట్లాడుతూ తన వ్యక్తిగత మరియు వృత్తి జీవితంలో సాధించిన ఘనతలను విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య ప్రసాదరాజు సతీమణి శ్రీమతి అరుణ ప్రసాద్ రాజు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసి దంపతులను ప్రిన్సిపల్ డాక్టర్ కమల కుమారి మరియు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ సునీత, కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల మహిళా ఉద్యోగులకు విద్యార్థినులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. క్యాంపస్ మహిళా విభాగ సమన్వయకర్త డాక్టర్ అనిలాంబిక ఆధ్వర్యంలో క్యాంపస్ లో ఉన్న బోధన బోధనేతర మహిళా సిబ్బందిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ కే జోసెఫ్ స్టీఫెన్, డాక్టర్ కే హారిక, కే ఎన్ ఎస్ ఎస్ వి ప్రసాద్, మరియు డాక్టర్ ఎం. సత్యనారాయణ, డాక్టర్ శ్రీరామరాజు, డాక్టర్ విజయశ్రీ, డాక్టర్ హరిబాబు, డాక్టర్ గోపి, ఎండిఆర్ నదీమ్, శ్రీనివాసరావు, జ్యోతి కిరణ్, మణికంఠేశ్వర్ రెడ్డి, స్రవంతి,దుర్గాభవాని డాక్టర్ ఉమా రజిత, విద్యార్థులు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం శ్రీమతి రాధా మాధవి ఆధ్వర్యంలో విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.





# రెజ్యూమ్ బిల్డింగ్‌పై వర్క్‌షాప్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ యాంత్రిక్ క్లబ్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని ఎన్-బ్లాక్‌లో "రెస్యూమ్ బిల్డింగ్‌పై ఒక రోజు వర్క్‌షాప్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదికవి నన్నయ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్, సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ బ్రాంచ్ మరియు ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌ల నుండి మొత్తం 120 మంది విద్యార్థులు చురుకుగా పాల్గొంటున్నారు. రిసోర్స్ పర్సన్లు, స్పీకర్ బిబి అహ్మద్ అలీ బాబా, ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రెజ్యూమ్ బిల్డింగ్‌పై అద్భుతమైన ఉపన్యాసం అందించారు. ఇది సమ్మర్ ఇంటర్న్‌షిప్‌కు చాలా ముఖ్యమైనది మరియు మెరుగుపరచడంలో సహాయపడే రెజ్యూమ్ రైటింగ్, మోటివేషనల్ లెటర్ రైటింగ్, రీసెర్చ్ స్టేట్‌మెంట్ రైటింగ్ మొదలైనవని చెప్పారు. యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. పెర్సిస్ పాల్గొనేవారికి స్ఫూర్తినిచ్చేలా



విలువైన సందేశంతో ప్రసంగించారు. రిసోర్స్ పర్సన్, స్పీకర్ శ్రీ బి బి అహ్మద్ అలీ బాబాను శాలువా మరియు మెమెంటోతో సత్కరించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం కోర్స్ కోఆర్డినేటర్ బి లక్ష్మి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. అశోక్ అందించిన మద్దతు మరియు ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం యాంత్రిక్ క్లబ్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. దుర్గారావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం కోర్సు కోఆర్డినేటర్ బి. లక్ష్మి మరియు మెకానికల్ ఇంజనీరింగ్ ఇతర సిబ్బందికి నిరంతరం సహకరిస్తున్నందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా సాధికారతే సమగ్ర అభివృద్ధికి నిదర్శనం




దేశాభివృద్ధికి మహిళా సాధికారతకు మించిన సాధనం లేదు. ఎందుకంటే జనాభాలో సగభాగం మహిళలే వీరికి ప్రభుత్వం సరైన అవకాశాలు, ప్రోత్సాహం ,శిక్షణ కల్పిస్తే మహిళలు దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తారు .శ్రమలో, నైపుణ్యం లో, తెలివితేటల్లో వీరు పురుషులతో సమానంగా వ్యవహరిస్తారు. అలాంటి సమర్థత గల స్త్రీ జాతిని ఎన్నో దశాబ్దాలుగా ఎన్నో అరాచకాలు ,అన్యాయాలకు గురి చేస్తూ బానిసలుగా చూడటం వలన మన దేశంలో అభివృద్ధి చెందకపోవడానికి ఇది ఒక కారణం. మనదేశంలో స్త్రీలకు వేద కాలంలో సముచిత స్థానం కల్పించినప్పటికీ తర్వాతి కాలంలో పరిస్థితి దిగజారిపోయింది. మతం, సాంప్రదాయం, పితృస్వామ్య ఆధిపత్యంతో వీరి అణిచివేత ప్రారంభమైంది.మహిళా సాధికారతే సమగ్ర అభివృద్ధికి నిదర్శనం .నీటి కాలంలో వివిధ వర్గాల అభివృద్ధి వికాసం పై జరుగుతున్న చర్చల్లో మహిళా సాధికార అంశం ఒక్కటి. “సాధికారత అంటే ప్రతి వ్యక్తి కి తనకు సంబంధించిన అన్ని అంశాలలో సొంతంగా నిర్ణయం తీసుకునే అధికారం ఉండటం”. “మహిళా సాధికారత అంటే మహిళలు సామాజిక ,ఆర్థిక రాజకీయ ,సాంస్కృతిక వ్యక్తిగత విషయాల్లో పురుషులతో సమానంగా స్వసక్తితో , ఆత్మవిశ్వాసంతో తమ అభీష్టం మేరకు నిర్ణీకరణ శక్తి కలిగి ఉండటం.” మహిళలు అన్ని విధాల అభివృద్ధి చెందాలన్నా అన్ని రకాల సాధికారతను సాధించాలన్న భారత రాజ్యాంగం ప్రసాదించిన మహిళా హక్కులను, చట్టాలను మరియు మహిళా సాధికారత పథకాలు వంటివి తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలంటే స్త్రీలు విద్యావంతులై ఉండాలి. విద్యుత్ ద్వారా విజ్ఞానం విజ్ఞానం ద్వారా నైపుణ్యం నైపుణ్యం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. అందువల్ల స్త్రీలకు సమాన విద్య అవకాశాలు ఉండాలి. చైతన్యవంతమైన మహిళలు సమాజ కుటుంబ స్థితిగతులను మార్చగలరు. వీరు సమాజాభివృద్ధికి ఎంతో కృషి చేయగలుగుతారు.మహిళలు ప్రభుత్వాల్లో తమ వంతు పాత్ర పోషించినప్పుడే వారు పూర్తిస్థాయి పౌరులుగా ఉంటారు. ఆధునిక యుగంలో రాజకీయ అధికారం. ఆర్థిక అభివృద్ధి ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి మహిళలకు 73, 74 వ రాజ్యాంగ సవరణలలో ప్రసాదించిన 50% రిజర్వేషన్ అవకాశం స్థానిక ప్రభుత్వాలలో తొలిమెట్టు అని చెప్పవచ్చు. ఎన్నికైన మహిళలు స్థానిక ప్రభుత్వాల తీరు తెన్నులను, విధివిధానాలను స్పష్టంగా అర్థం చేసుకోవాలి. పురుష ప్రతినిధులకు ఏ విధంగానూ తీసిపోని సమర్థులైన మహిళ నాయకురాలుగా ఎదగాలి.ప్రతిరోజు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవటానికి మనకున్న చట్టాలను తెలుసుకోవాలి అప్పుడు మాత్రమే మాట్లాడవచ్చు న్యాయ సహాయం పొందవచ్చు మహిళలు స్వయంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదిగినప్పుడే సాధికారతను సాధించిన వారు అవుతారు.

- ఏ.జె.ఎస్.దీప్తి
ఎం.ఏ పొలిటికల్ సైన్స్ ,బి.ఎడ్.
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం. పూర్వ విద్యార్థి

## పోలవరం సీఈని కలిసిన ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డా. వి. పెర్సిస్, సివిల్ ఇంజనీరింగ్ కోర్స్ కోఆర్డినేటర్ వర్మ లు పోలవరం చీఫ్ ఇంజనీర్ సుధాకర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజనీరింగ్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పోలవరం ఇంజనీర్ల సేవలు అందించాలని కోరారు. పోలవరం ప్రాజెక్ట్ సివిల్ ఇంజనీర్ల సేవలను అందించాలని సిఈ కి వినతి పత్రం సమర్పించారు. యూనివర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలను అందించాలని విజ్ఞప్తి చేశారు.

## జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవం



1932లో భారతదేశంలో ఫార్మసీ విద్యను స్థాపించిన ఫార్మసీ పితామహుడిగా ప్రసిద్ధి చెందిన ప్రొఫెసర్ మహదేవ్ లాల్ ష్రాఫ్ జయంతి సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ తాడేపల్లిగూడెంలో జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగం విద్యార్థులు, సిబ్బంది ఎం.ఎల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని డిపార్ట్మెంట్ కోర్స్ కోఆర్డినేటర్ డా. హీరా బట్టు మరియు స్టాఫ్ సభ్యులు కె. నిత్యానందన్ రెడ్డి, ఎస్. లిఖిత మరియు పి. అరుణ నిర్వహించారు.


# ప్రపంచ విజేతలు - వ్యక్తిత్వ నిర్మాణం




మహాకవి,నాటక కర్త అయిన షేక్స్ పియర్, మహానటుడు చార్లీ చాప్లిన్, మహామేధావి కార్ల్ మార్క్స్ జీవితాల్లోని వ్యక్తిత్వ నిర్మాణాలను ఒక చోటచేర్చి డా.కత్తి పద్మారావు గారు రచించిన ఈ పుస్తకం నిజంగా అద్భుత అనుభూతిని అందిస్తుంది. షేక్స్ పియర్,చార్లీ చాప్లిన్, కార్ల్ మార్క్స ఈ ముగ్గురు మేధావులు ఒకే కాలానికి సంబంధించినవారు కాదు.ఒకే రంగానికి సంబంధించినవారు కూడా కాదు.కానీ ఈ ముగ్గురు అసాధారణ ప్రతిభావంతులు.ఎన్నో తరాలవారిని తన రచనల ద్వారా,తన నటన ద్వారా, తన మేధాసంపత్తి ద్వారా ఎందరినో ప్రభావితంచేశారు. షేక్స్ పియర్ మనిషి అంతరంగాన్ని శోధించాడు. ఈయన రచనలు,నాటకాలు చదివితే మనలో ఉన్న అనేకరకాల పాత్రలు ప్రత్యక్షమవుతాయి. రచయితగా ఆయన శైలి చాలా విశిష్టమైనది.అందుకే ఆయన రచనలు ఇప్పటికీ ఎంతో మందిని ఆకట్టుకుంటున్నాయి. అలాగే చార్లీ చాప్లిన్ దుఃఖాన్ని హాస్యాస్పదంగా ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి.బాల్యం నుంచి ఆయన అనుభవించిన పేదరికం,కష్టాలు ఆయన జీవనశైలిని నిర్ణయించాయి.అపజయాల నుంచి విజయాల వైపు ప్రయాణించే మార్గంలో ఆయన చూపించిన పట్టుదల అసమాన్యం.ఈయన ప్రయాణించిన మార్గం నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తుంది.ఆయన చిత్రాలు కేవలం నవ్వించడానికే కాదు..మనల్ని ఆలోచింపజేస్తాయి కూడా.

అదే విధంగా కార్ల్ మార్క్స నిరంతర అధ్యయనశీలి.ఎన్నో తత్వశాస్త్ర గ్రంథాలను అధ్యయనం చేసి ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేశాడు. ప్రపంచంలోని అందరు మేధావులను కార్మికులను రాజకీయ పార్టీలను ప్రభావితం చేసిన ఆధునిక సామాజిక శాస్త్ర నిర్మాత కార్ల్ మార్క్స. ఈ ముగ్గురిలో అనేక నాయకత్వ లక్షణాలు ఉన్నాయి.సమాజాన్ని ఉత్తేజ పరిచే ప్రతిభ చాలాఉంది. ఈ ముగ్గురి జీవిత చరిత్రలు చదివినప్పుడు మనలో కూడా ఎంతో ఉత్సాహం, ఏదో సాధించాలనే పట్టుదల కలుగుతుంది.నేటి యువతలో ఇటువంటి ఉత్సాహం,పట్టుదల కల్పించాలనే ఉద్దేశంతో కత్తి పద్మారావు గారు ఈ ముగ్గురిపై రచనలు చేసి ఒక పుస్తకంగా తీసుకొచ్చారు. ఈపుస్తకం చదవడం వలన మనకు మనం స్వీయ వ్యక్తిత్వ నిర్మాణం ఎలా నిర్మించుకోవాలో అవగాహన ఏర్పడుతుంది.

- బి.సుశాంత్ కుమార్



## ప్రతిభావాణి



# కోనేరు హంపి

కోనేరు హంపి 1987, మార్చి 31న ఆంధ్రప్రదేశ్ లోని గుడివాడలో జన్మించారు. ఐదు సంవత్సరాల పిన్న వయసులోనే తన తండ్రి కోనేరు అశోక్ ద్వారా హంపికి చదరంగం పరిచయమైయింది. 1995లో 8 సంవత్సరాలలోపు వారికి నిర్వహించిన జాతీయ చదరంగం పోటీలో హంపి నాలుగవ స్థానం కైవసం చేసుకోగానే, అశోక్ తన వృత్తినుండి తొలగి హంపికి పూర్తి స్థాయి శిక్షకుడిగా మారిపోయాడు. ఆ తరువాత 1998లో 10 సంవత్సరాలలోపు వారికి నిర్వహించిన జాతీయ చదరంగం పోటీలో హంపి స్వర్ణపతకం సంపాదించి, వివిధ వాణిజ్య సంస్థలనుండి ఆర్థిక ప్రోత్సాహకాలను అందుకుంది.

**క్రీడా విశేషాలు:**

హంపి ప్రపంచ జూనియర్ బాలికల చెస్ చాంపియన్‌షిప్‌ను 2001 లో కైవసం చేసుకుంది.


2007 అక్టోబరు లో ఫైడ్ ఎలో రేటింగ్ లో 2600 పాయింట్లను దాటి మహిళా చదరంగంలో జూడిత్ పోల్గర్ తర్వాత ప్రపంచంలో రెండో స్థానంలో నిల్చింది. ఈ స్థానం సంపాదించిన భారతదేశపు తొలి చెస్ క్రీడాకారిణి హంపి. మహిళా గ్రాండ్ మాస్టర్‌లలోనే కాదు మొత్తం గ్రాండ్ మాస్టర్లలో అతి చిన్న వయస్సులో గ్రాండ్ మాస్టర్ హెూదా పొందిన రికార్డు సృష్టించింది. కేవలం 15 సంవత్సరాల నెలా, 27 రోజుల వయస్సులోనే ఈ స్థానానికి ఎదిగింది

**పురస్కారాలు:**

చదరంగం ఆటలో హంపి చూపించిన విశేష ప్రతిభకు గుర్తింపుగా 2007లో భారతదేశ ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం ఇచ్చి సత్కరించింది.

2003 లో చదరంగం ఆటకు ఇచ్చిన అర్జున అవార్డును హంపి కైవసం చేసుకుంది.

2008 లో శ్రీ రాజా లక్ష్మీ పురస్కారం లభించింది. ఎంతోమంది మహిళలకు,మహిళా క్రీడాకారులకు హంపి స్ఫూర్తిదాయకమైన వ్యక్తిగా నిలిచారు.



# తెలుగుశాఖ ఫ్రెషర్స్ పార్టీ



ఆకవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ తెలుగు శాఖ ఆధ్వర్యంలో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీని ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్ టేకి, తెలుగు శాఖ కో ఆర్డినేటర్ డా. కె. వి. ఎన్. డి. వరప్రసాద్, సహాయాచార్యులు డా. తలారి వాసు, డా. తరపట్ల సత్యనారాయణ, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





# ఫార్మసీ విభాగం ఫ్రెషర్స్ పార్టీ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం నూతనంగా ప్రారంభించిన ఫార్మసీ క్యాంపస్ సెమినార్ హాల్‌లో ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నూతనంగా ఫార్మసీ కోర్సులోనికి ప్రవేశించిన విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సంజీవ్ ఫార్మసీలు మరియు ఔరా హెల్త్ కేర్ వ్యవస్థాపకులు రాజీవ్ ఆకుల, విశాఖపట్నం ల్యాబ్స్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, డిపార్ట్‌మెంట్ కోర్స్ కోఆర్డినేటర్ డా.హీరా బట్టు మరియు అధ్యాపకులు కె. నిత్యానందన్ రెడ్డి, పి.లిఖిత, పి.అరుణ తదితరులు హాజరై ఫ్రెషర్స్ పార్టీ ప్రోగ్రాంకి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.





విశ్వవిద్యాలయ ప్రాంగణంలో హెూలీ పండుగ చిత్రాలు